పల్లెల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

- వారం రోజుల పాటు పల్లె ప్రగతి తరహాలో కార్యక్రమం నిర్వహణ
- ఉదయం 7 గంటలకే విధులకు హాజరుకావాలని అధికారులకు ఆదేశాలు
- అవసరమైతే అదనంగా రోజువారి సిబ్బందిని నియమించాలని సూచన


మంచ్యాతండాలో పైపులైను లీకేజీలకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

మఠంపల్లి : రాష్ట్ర ప్రభుత్వం పల్లెల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించింది. పల్లెల్లో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టేందుకు ఈనెల బుధవారం (నేటి) నుంచి 23 వరకు పల్లె ప్రగతి తరహాలో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈమేరకు జిల్లా స్థాయి ఉన్నతాధికారుల ఆదేశాలతో మండలాల్లోని ఎంపీడీఓలు, ఎంపీఓలు గ్రామాలపై దృష్టి సారించారు. దీనిలో భాగంగా ప్రతినిత్యం గ్రామ పంచాయతీలలో పనిచేసే తాత్కాలిక సిబ్బందితో పాటు అవసరమైతే అదనంగా రోజువారి సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. పల్లెలు పరిశుభ్రంగా ఉండేందుకు గ్రామపంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు ఉదయం 7 గంటలకే విధులకు హాజరుకావాలని ఆదేశాలిచ్చారు.

చేపట్టే పనులు ఇవే..

ప్రతిఏటా జూన్ నుంచి ఆగస్టు మాసాల మధ్య పల్లె ప్రగతి పనులు చేపట్టేవారు. అయితే ఈసారి వర్షాకాలం రాకముందే గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలనే ఉద్దేశ్యంగా ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గ్రామ పంచాయతీలలో మురికి కాలువల పూడికతీత, తాగునీటి పైపులైన్లు లీకేజీలకు మరమ్మతులు చేయడం, వీధులలో రోడ్లకిరువైపులా పెరిగిన కంపచెట్ల తొలగింపు, చెత్తకుప్పల తొలగింపు, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని అవసరమైతే వీధులలో రాళ్లు, పెంటదిబ్బలు తొలగింపునకు జేసీబీలను ఉపయోగించుకోవాలని తెలిపారు.

జీపీ నిధులు ఉపయోగించుకోవాలి



గ్రామ పంచాయతీలలో నేటి నుంచి వారం రోజుల పాటు పారిశుద్ధ్య పనులు పల్లె ప్రగతి మాదిరిగా నిర్వహించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈమేరకు అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు ప్రతినిత్యం ఉదయం నుంచి పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. అయిన ఖర్చులను ఎంబీ రికార్డులతో పంచాయతీల నిధులు ఉపయోగించుకోవాలి.

– మామిడి జానకిరాములు, ఎంపీడీఓ మఠంపల్లి

వారం రోజుల పాటు చేపట్టే వివిధ పారిశుద్ధ్య పనులను పంచాయతీరాజ్ మండల ఏఈఈలతో ఎంబీలు చేయించి పంచాయతీ నిధుల నుంచి ఖర్చు చేయాలని ఆదేశించారు. వారంరోజులపాటు గ్రామాలలో పేరుకుపోయిన పారిశుద్ధ్య పనులు పరిశుభ్రం కానున్నాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆశలకు ఫిక్స్‌డ్ వేతనాలు అమలు చేయాలి


ఎమ్మెల్యే సైదిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు, యూనియన్ నాయకులు

హుజూర్‌నగర్ : ఆశ వర్కర్లకు పనికి తగ్గ పారితోషికం కాకుండా ఫిక్స్‌డ్ వేతనాలను అమలు చేయాలని వారు కోరారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తెలంగాణ మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిని పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశవర్కర్లకు ఆరోగ్య బీమా కార్డులు ఇవ్వాలని కోరారు. ఏఎన్ఎం కోర్స్ పూర్తిచేసిన ఆశలకు ఏఎన్ఎం ఉద్యోగాల భర్తీలో మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అర్హులైన ఆశ కార్యకర్తలకు డబల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఐ.రామకృష్ణ, డివిజన్ అధ్యక్షుడు బి.రాములు, వి.శ్రీనివాస్, బి.శ్రీనివాస్, ఆశల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, సీత, జానకి, లక్ష్మీ, శైలజ, సుజాత, మరియమ్మ, మాలతి, స్నేహలత, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

మూడు పూరి గుడిసెలు, రెండు గడ్డివాములు దగ్ధం

పెన్‌పహాడ్ : షార్ట్‌సర్క్యూట్‌కు గురై మూడు పూరి గుడిసెలు, రెండు గడ్డివాములు దగ్ధమైన సంఘటన నాగులపాటి అన్నారంలో మంగళవారం చోటు చేసుకుంది. ఆర్ఐ స్వప్న తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నకిరేకంటి దేవయ్య ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ కావడంతో పూరి గుడిసెకు నిప్పంటుకుంది. ఆ నిప్పురవ్వలు ఎగిరి పక్కనే ఉన్న పున్నయ్య, చిన ఈదయ్య పూరి గుడిసెలపై, రెండు గడ్డివాములపై పడటంతో దగ్ధమయ్యాయి. సుమారు రూ. లక్ష నష్టం వాటిల్లినట్లు ఆర్ఐ తెలిపారు. ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ ఫైర్ ఇంజన్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను ఆర్పించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్, సర్పంచ్ ధోటమ్మ సత్యనారాయణ, యుగేందర్ పరిశీలించారు.

ఆపన్నహస్తంలా సీఎం సహాయ నిధి

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి


హుజూర్‌నగర్ : సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : ఆపదలో ఉన్న వారిని సీఎం సహాయ నిధి ఆపన్నహస్తంలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని మాధవరాయునిగూడెం, అనుములగూడెంలో లబ్ధిదారులకు మంజూరైన రూ.1.76 లక్షల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం క్యాంప్ కార్యాలయంలో వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి, మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, సీనియర్ నాయకుడు అట్లూరి హరిబాబు, కౌన్సిలర్ ఎ.గంగరాజు, అమర్‌గౌడ్, ప్రదీప్, గురవయ్య, ముక్కంటి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆపదొస్తే నాకు ఫోన్ చేయండి: ఎమ్మెల్యే


గానుగుబండలో లచ్చయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

గరిడేపల్లి : మండలంలోని గానుగుబండ గ్రామంలో వివిధ కారణాలతో ఇబ్బందులు పడుతున్న పలువురిని స్థానిక ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి మంగళవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న పంగా రామయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే అనారోగ్యానికి గురైన మంగళపల్లి లచ్చయ్యను, వెన్ను ఆపరేషన్ చేయించుకున్న పార్టీ కార్యకర్త ముళ్ల సందీప్‌లను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తనకు ఫోన్ చేయవచ్చని, నిరంతరం అందుబాటులోనే ఉంటానని అన్నారు. ఆయనవెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, సర్పంచ్ పంగ వీరస్వామి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కొత్త సతీష్‌రెడ్డి, ముళ్ల గోపాలకృష్ణ, గురువయ్య, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

డెంగీ నివారణలో భాగస్వాములు కావాలి

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్


కోదాడ : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్


నేరేడుచర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


చిలుకూరులో ర్యాలీ తీస్తున్న డాక్టర్, వైద్య సిబ్బంది

కోదాడ : డెంగీ వ్యాధి నివారణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ కోరారు. మంగళవారం కోదాడలోని కాశీనాథం పంక్షన్ హాల్‌లో నిర్వహించిన జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఇంటి యజమాని తన ఇంటిలో, ఇంటి పరిసరాలలో మురుగు నీరు, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలన్నారు. వైద్యసిబ్బంది కూడా గ్రామాలలో దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ కోటాచలం, డిప్యూటీ డీఎంహెచ్ఓ నిరంజన్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వరరెడ్డి, వైద్యులు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వేదిక కింద నుంచే చైర్‌పర్సన్ ప్రసంగం..

జాతీయ డెంగీ దినోత్సవంలో విచిత్ర సంఘటన చోటుచేసుకుంది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీషను కూడా అధికారులు ఆహ్వానించారు. అయితే ఎమ్మెల్యేతో ఉన్న అభిప్రాయ భేదాలతో కొంతకాలంగా ఆమె ఎమ్మెల్యేతో వేదిక పంచుకోవడం లేదు. ఈ క్రమంలో మంగళవారం డెంగీ నివారణ దినోత్సవంలో ఆమె ఎమ్మెల్యే రావడానికి ముందే కార్యక్రమానికి వచ్చి వేదిక కింద నుంచే అప్పటికే హాజరైన వారిని ఉద్దేశించి ప్రసంగించి వెళ్లిపోయారు. ఆమె వెళ్లిన తరువాత వచ్చిన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ప్రారంభించి వేదిక మీద నుంచి ప్రసంగించారు.

జాతీయ డెంగీ నివారణ దినోత్సవం

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారిని నాగిని, సూపర్‌వైజర్ శ్యాంసుందర్‌రెడ్డి, సిబ్బంది పుష్పావతి, రేణుక, సునిత, నాగమణి, క్రాంతి, ఆశ వర్కర్లు తులసి, పావని, రజిత, యశోద, సునిత, రాజ్యం, మంజుల, విజయనిర్మల తదితరులు ఉన్నారు.

చిలుకూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో..

చిలుకూరు : చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డెంగీ వ్యాధి నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నవ్య, సుశీల, సీహెచ్ఓ.వినోద్, సూపర్‌వైజర్ సావిత్రి, హెల్త్ అసిస్టెంట్ శ్రీను, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

నడిగూడెం : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్.లక్ష్మీప్రసన్న కోరారు. మంగళవారం మండల పరిధిలోని తెల్లబెల్లిలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచ్ దేవబత్తిని వెంకటనర్సయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల వజ్రోత్సవాలకు ఏర్పాట్లు


వజ్రోత్సవాల నిర్వహణకు ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 75 వసంతాలు పూర్తిచేసుకుంది. దీంతో త్వరలో వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పూర్వ విద్యార్థులు సిద్ధమవుతున్నారు. దీంతో వజ్రోత్సవ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాల వరకు చదువుకున్న వారి వివరాలను సేకరించి సమాచారం అందించారు. వజ్రోత్సవాలను విజయవంతం చేసేందుకు స్థానిక ప్రజలు, పూర్వ విద్యార్థులు కృషి చేయాలన్నారు. కాగా పాఠశాలకు చెందిన 1976– 77 బ్యాచ్ పూర్వ విద్యార్థులు కరణం లక్ష్మి, భారతి, కటికం లక్ష్మీనారాయణ, బిల్లా గురునాథం, పశ్యా కృష్ణారెడ్డి, జి.భిక్షం, సింగిరెడ్డి సంజీవరెడ్డి వజ్రోత్సవాల నిర్వాహణకు తమవంతుగా కమిటీకి లక్ష 10 వేల రూపాయలను మంగళవారం అందజేశారు.

29న స్నేహిత ఉమెన్స్ ఆర్గనైజేషన్ వార్షికోత్సవం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న శైలజ, తదితరులు

కోదాడఅర్బన్ : పట్టణంలోని కోదాడ పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో స్నేహిత ఉమెన్స్ ఆర్గనైజేషన్ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఈ నెల 29న నిర్వహిస్తున్నట్లు ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు మాతంగి శైలజ తెలిపారు. మంగళవారం కోదాడలోని బాలుర ఉన్నత పాఠశాలలో గల అక్కిరాజు కళా వేదికపై వార్షికోత్సవ వాల్ పోస్టర్‌ను వివిధ వర్గాల వారితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్షికోత్సవంలో భాగంగా వివిధ రంగాలలో విశిష్ట సేవలందించిన వారికి పురస్కారాలు అందించి సత్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, అరుణోదయ సంయుక్త సమాఖ్య జాతీయ అధ్యక్షురాలు విమలక్క, కోదాడ ఎంపీపీ చింత కవితారెడ్డి, ఓయూ జేఏసీ చైర్మన్ దరువు అంజన్న, తెలంగాణ ప్రజాగాయకుడు ఏపూరి సోమన్న పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏసీసీఎస్‌టీ రాష్ట్ర అధ్యక్షుడు పంది తిరపయ్య, నర్సింహరావు, కల్యాణ్, నాగేశ్వరరావు, భాస్కర్, సైదులు, రాము, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేట రూరల్ : 2023–24 విద్యా సంవత్సరానికి గాను సూర్యాపేట మండలంలోని ఇమాంపేట ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శంకర్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీలలో గ్రూపునకు 40 సీట్లు ఉన్నాయని తెలిపారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన బాల, బాలికలు కళాశాలలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

● భానుడి తాపానికి 'తాటి ముంజల' ఉపశమనం



చిలుకూరు : తాటిముంజల సీజన్ మొదలైంది. రోడ్లపై అక్కడక్కడ వ్యాపారులు తాటిముంజలు అమ్ముతూ కనిపిస్తున్నారు. కాగా ప్రస్తుతం ఎండలు మండిపోతుండటంతో ప్రయాణికులు తాటి ముంజలు కొనుక్కొని తిని భానుడి తాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు. ఎండకు తాటి ముంజులు తింటే చలువ అని రోడ్డుపై ఆగి మరి తాటి ముంజలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ముంజలకు మంచి డిమాండ్ పెరిగింది. డజన్ రూ.50కి అమ్ముతున్నారు. మంగళవారం చిలుకూరు గ్రామ పరిధిలోని కోదాడ –హుజూర్‌నగర్ నేషనల్ హైవేపై కవితా జూనియర్ కళాశాల సమీపాన ప్రయాణికులు తాటి ముంజలు కొనుగోలు చేస్తు ఇలా కనిపించారు.

తిరుమలలో శ్రీఅన్నమయ్య భజన బృందం

- అఖండ హరినామ సంకీర్తనలో భక్తిగీతాలు ఆలపించిన సభ్యులు


తిరుమలలో భక్తి పాటలు పాడుతున్న శ్రీ అన్నమయ్య భజన బృందం సభ్యులు

హుజూర్‌నగర్ : తిరుమలలోని శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన అఖండ హరినామ సంకీర్తనలో హుజూర్‌నగర్‌కు చెందిన శ్రీ అన్నమయ్య భజన బృందం సభ్యులు పాల్గొని భక్తి గీతాలు, భజన పాటలు ఆలపించారు. ఈ సందర్భంగా మంగళవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. స్వామివారి సన్నిధిలో భజన, భక్తి గీతాలు ఆలపించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. మండలి సభ్యులకు దేవస్థానం వారు స్వామివారి దివ్య దర్శనం చేయించి, భోజన వసతి, రవాణా చార్జీలు చెల్లించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండలి సభ్యులు బి.కొండయ్య, రాము, రజని, అనంతలక్ష్మి, భిక్షం, రవి, శివలక్ష్మి, గోపిరెడ్డి, విజయ, శ్రీనివాసరెడ్డి, లక్ష్మి, బద్రీ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు వారాలుగా ఉపాధి కూలి చెల్లించకపోవడం అన్యాయం

మునగాల : జాతీయ ఉపాధి హామీ పథకంలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కూలీలకు ఆరు వారాలు గడుస్తున్నప్పటికీ కూలి డబ్బులు చెల్లించకపోవడం అన్యాయమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మునగాల మండలంలోని తాడువాయి గ్రామ శివారులో ఉపాధి పనులు నిర్వహిస్తున్న ప్రదేశాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులు నిర్వహించే ప్రదేశంలో సౌకర్యాలు అమలు చేయడంలో అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు సొంపంగు జానయ్య, అరె.రామకృష్ణారెడ్డి, ఉపాధి హామీ మేట్లు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.


తాడువాయిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ములకలపల్లి రాములు

పట్టణంలో నలుదిక్కులా అభివృద్ధి

సూర్యాపేట : పట్టణంలోని 48 వార్డుల్లో నలుదిక్కులా ఎనలేని అభివృద్ధి కొనసాగుతోందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపట పట్టణంలోని 1, 4, 8, 27, 43, 14 వార్డుల్లో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాల పనులకు మంత్రి జగదీశ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏ వార్డుకెళ్లి చూసినా అభివృద్ధే కనిపిస్తుందన్నారు. గతంతో పోలిస్తే గడిచిన ఎనిమిదేళ్ల కాలంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, లింకురోడ్లు వేశామని తెలిపారు. పట్టణంలో విశాలమైన రోడ్లతో పాటుగా సెంట్రల్ లైటింగ్స్, గ్రీనరీతో పేట ప్రజలకు స్వాగతం పలుకుతున్నాయన్నారు. మహాప్రస్థానం, ట్యాంక్‌బండ్‌లు చూస్తే.. అభివృద్ధి అంటే ఏంటో కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ వైవీ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, కమిషనర్ పెడబల్లి రామాంజులరెడ్డి, కౌన్సిలర్లు రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, మడిపల్లి విక్రమ్, పద్మ, చిరువెళ్ల లక్ష్మీకాంతమ్మ, సత్యనారాయణరెడ్డి, శభరి తదితరులు పాల్గొన్నారు.

అడ్లూరు సర్పంచ్‌పై నేడు అవిశ్వాసం

- సర్పంచ్ మృతితో ఉపసర్పంచ్ లచ్చిరెడ్డికి సర్పంచ్ బాధ్యతలు
- అవిశ్వాసం పెట్టాలని కలెక్టర్‌కు వ్యతిరేక వర్గం ఫిర్యాదు
- ఉత్తర్వులు జారీ చేసిన అధికారులు


అడ్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయం

కోదాడరూరల్ : మండలంలోని అడ్లూరు గ్రామ పంచాయతీ సర్పంచ్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని సర్పంచ్ వ్యతిరేకవర్గ సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సంబంధిత అధికారులు హాజరుకావాలని, వార్డు సభ్యులు అందుబాటులో ఉండాలని నోటీసులు కూడా పంపించారు. అయితే గత గ్రామ పంచాయతీ ఎస్సీ రిజర్వుడ్ అయిన ఈ స్థానం నుంచి బీఆర్ఎస్ మద్దతుతో పోటీ చేసిన అంబడిపూడి స్వరాజ్యం 54 ఓట్లతో గెలుపొందారు. 8 వార్డులున్న ఇక్కడ బీఆర్ఎస్ మద్దతుదారులు ముగ్గురు, కాంగ్రెస్ మద్దతుదారులు ఐదుగురు గెలుపొందారు. దీంతో కాంగ్రెస్ మద్దతుతో గెలుపొందిన ఐదుగురిలో ఒకరైన లచ్చిరెడ్డిని ఉపసర్పంచ్‌గా ఎన్నుకున్నారు.

సర్పంచ్ మృతితో..

సర్పంచ్‌గా ఉన్న స్వరాజ్యం మార్చి నెలలో అనారోగ్యంతో మృతి చెందారు. ఈ తర్వాత పంచాయతీరాజ్ నిబంధనల ప్రకారం ఉపసర్పంచ్‌గా ఉన్న లచ్చిరెడ్డి సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. అయితే అతను సర్పంచ్‌గా ఉండేందుకు ఇష్టపడని వ్యతిరేక వర్గంలోని ఐదుగురు సభ్యులు అతనిపై అవిశ్వాసం పెట్టాలని డీపీఓ, ఆర్డీఓ, ఎంపీడీఓలకు వినతిపత్రాలు అందజేశారు. ఆతర్వాత అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ అవిశ్వాసం పెట్టాలని ఆర్డీఓకు ఆదేశాలు జారీ చేశాడు.

అంతా బీఆర్ఎస్ వారే..

అయితే సర్పంచ్ ఎన్నికలు జరిగిన కొంతకాలం తర్వాత కాంగ్రెస్ మద్దతుతో గెలుపొందిన వారు కూడా బీఆర్ఎస్ పార్టీలో చేరారు. దీంతో గ్రామ బీఆర్ఎస్‌లో వర్గపోరు మొదలైంది. పలు సందర్భాల్లో బీఆర్ఎస్ పార్టీలోని వర్గపోరు బయటపడింది. అయినా దిద్దుబాటు చర్యలు చేపట్టకపోవడంతో అది అవిశ్వాసం వరకు దారితీసింది. కాగా 8 మందిలో సర్పంచ్‌గా ఉన్న అతనితో పాటు మరో ఇద్దరు మద్దతు తెలుపుతున్నారు. మరో ఐదుగురిలో ఒకరిని ఎస్సీ సామాజికం వర్గం వారినే సర్పంచ్‌గా ఉండేందుకు ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. సర్పంచ్ ఎస్సీ రిజర్వుడ్ కాబట్టి మళ్లీ వారికే ఛాన్స్ ఇద్దామని అంటున్నట్లు తెలుస్తోంది.

ఎమ్మెల్యే చెప్పినా..

సర్పంచ్ పదవి కాలం ఉన్నది ఆరు నెలలే కదా ఎందుకు ఇంత రాజకీయమంటూ పార్టీ ముఖ్యులు చెబుతున్నా వార్డు సభ్యులు వినిపించుకోవడం లేదు. మండలంలోని పలువురు నాయకులు ఐదుగురు సభ్యుల్లోని ముఖ్యులతో చర్చలు జరిపినా ఫలితం లేకుండా పోయింది. అవసరమైతే పార్టీ మారుతాం కానీ అతను వద్దంటే వద్దని చెబుతున్నారు. చివరకు ఎమ్మెల్యే చెప్పిన వారు వినని పరిస్థితి నెలకొంది. దీంతో ఏం చేయాలో అర్థం కాక పార్టీ నాయకులు సతమతమవుతున్నారు. అవిశ్వాసం అనివార్యం కావడంతో సంబంధిత అధికారులకు, వార్డు సభ్యులకు ఆర్డీఓ నోటీసులు జారీ చేశారు. పోలీసులు కూడా గ్రామానికి వెళ్లి పరిస్థితి తెలుసుకున్నారు. రెండు పక్షాల వారూ బీఆర్ఎస్ పార్టీ కావడంతో పార్టీ ముఖ్యులు అందరిని పిలిపించి మాట్లాడుతారా.. లేక అవిశ్వాసం తప్పదా అనేది చూడాలి మరి.

క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు


అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

కోదాడఅర్బన్ : పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో వేంచేసియున్న శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి తెల్లవారుజాము నుంచే పంచామృతాలతో అభిషేకం, సింధూరాభిషేకాలు నిర్వహించారు. ఆకుపూజ, పుష్పాలంకరణ, మహర్నివేదన గావించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. దాతల సహకారంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జూకూరి అంజయ్య, అన్నదాన నిర్వాహకుడు దేవరశెట్టి హనుమంతరావు, రామారావు, దాతలు, భక్తులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి


విజేతలుగా నిలిచిన వాలీబాల్ క్రీడాకారులతో అంజిరెడ్డి, ఎంపీఓ, తదితరులు

పాలకవీడు : గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి అన్నారు. మంగళవారం గుడుగుంట్లపాలెంలో జరిగిన సీఎం కప్ క్రీడా పోటీల్లో పాలకవీడుకు చెందిన వాలీబాల్ జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా వారిని అభినందించి మాట్లాడారు. గ్రామీణ స్థాయి నుంచే యువ క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహిస్తుందన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన జట్టు జిల్లా స్థాయిలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ దయాకర్, పంచాయతీ కార్యదర్శి నాగపద్మజ, పీఈటీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థలను అంబానీ, అదానీకి కట్టబెడుతున్న కేంద్రం


మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా కన్వీనర్ రాపోలు నవీన్

నేరేడుచర్ల : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా అంబానీ, అదానీలకు కట్టబెడుతుందని, ఇలా ప్రభుత్వ సంస్థలకు కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెట్టడమే దేశ భక్తినా అని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ రాపోలు నవీన్ అన్నారు. మంగళవారం నేరేడుచర్లలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కర్ణాటక ఫలితాలతో దేశవ్యాప్తంగా బీజేపీకి ఎదురుగాలి మల్లిందన్నారు. బీజేపీ చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలకు రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారని అన్నారు. ఆయన వెంట నాయకులు కత్రి సతీష్‌రెడ్డి, రామస్వామి, నాగార్జున, హుస్సేన్ తదితరులు ఉన్నారు.

సైదేశ్వరరావుకు సన్మానం


ముత్తినేని సైదేశ్వరరావును సన్మానిస్తున్న కమ్మ సంక్షేమ సంఘం నాయకులు

కోదాడరూరల్ : టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఇటీవల నూతనంగా నియమితులైన ముత్తినేని సైదేశ్వరరావును కాకతీయ కమ్మ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఏర్నేని బాబు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలో మరిన్ని ఉన్నతమైన పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ముత్తవరపు రామారావు, సామినేని శ్రీనివాసరావు, నలజాల శ్రీనివాసరావు, సాధినేని అప్పారావు, సాతులూరి హనుమంతరావు, కృష్ణారావు, కోటేశ్వరరావు, అంజయ్య, నాగేశ్వరరావు ఉన్నారు.

చెక్కుల పంపిణీ


దాసారంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ జ్యోతి, జెడ్పీటీసీ నర్సయ్య

నేరేడుచర్ల : సీఎం సహాయ నిధి పథకం పేదలకు వరం లాంటిదని ఎంపీపీ లకుమళ్ల జ్యోతి, జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య అన్నారు. మంగళవారం మండలంలోని దాసారం, సోమారం గ్రామాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు, నాయకులు అన్నపూరెడ్డి నారాయణరెడ్డి, తిరుపతయ్య, ఏలిషా, గురువయ్య, నాగార్జున, నగేష్, వెంకటేశ్వర్లు, సుందరయ్య, మధార్, లక్ష్మణ్, సదానంద్, జక్కన్న, లింగారెడ్డి, వెంకన్న, పెద్దులు తదితరులు ఉన్నారు.